




దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 100 శనివారం 12-04-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## మూసీ పనుల్లో వేగం పెంచండి

**మీర్ ఆలం ట్యాంక్‌పై**

**వంతెన అద్భుతంగా ఉండాలి**

**వందేళ్ల అవసరాలకు తగినట్లుగా డ్రై పోర్టు**

**ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం చేయాలి**

**అధికారులతో సమీక్షల్లో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ఫోర్త్ (ఫ్యూచర్) సిటీ వరకు మెట్రో రైలును విస్తరించాలని, అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మెట్రో రెండో దశ విస్తరణ పనులకు సంబంధించిన పురోగతిపై ఆరా తీశారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెట్రో రైలు విస్తరణ పనులు, మూసీ పునరుజ్జీవం పనులు, జాతీయ రహదారుల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) పురోగతిపై ముఖ్యమంత్రి ఆయా శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. మెట్రో విస్తరణకు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో సంబంధిత అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు రాష్ట్ర అధికారులు సీఎంకు వివరించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు(36.8కి.మీ), రాయదుర్గం-కోకాపేటనియోపోలీస(11.6కి.మీ), ఎంజీబీఎస-చాంద్రాయణగుట్ట (7.5కి.మీ), మియాపూర్- పటాన్‌చెరు (13.4కి.మీ), ఎల్‌బీనగర్-హయత్‌నగర్ (7.1కి.మీ)వరకు మొత్తం 76.4కిలోమీటర్లకు రూ.24,269 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నం చేయాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవల్‌పమెంట్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ మేర మెట్రో ప్రాజెక్టును విస్తరించాల్సి ఉందన్నారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట్ వరకు పొడిగించాలని, అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, ఫ్యూచర్ సిటీ డెవల్‌పమెంట్ అథారిటీ సంస్థలను మెట్రో విస్తరణలో భాగస్వాములు చేయాలని ఆయన సూచించారు.

**'మూసీ'కి అనుగుణంగా జూపార్కు అప్‌గ్రేడ్**

మూసీ పునరుజ్జీవన పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై వంతెన నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని, ఈలోపు అందుకు అవసరమైన సర్వేలు చేపట్టాలని, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ బాపూఘాట్‌లో నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు, మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న వంతెన నమూనాలను పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే రెండున్నర కిలోమీటర్ల పొడవైన వంతెనను అద్భుతంగా నిర్మించాలని, సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం సూచించారు. సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే'ను తలపించేలా బర్డ్స్ ప్యారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా మీర్ ఆలం చెరువులోని మూడు ఐలాండ్స్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతోపాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, అంపీథియేటర్ ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలని సూచించారు. చెరువులో నీటిని శుద్ధి చేయడంతోపాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని, పీపీపీ విధానంలో ఐలాండ్స్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. మీర్ ఆలం వంతెన అభివృద్ధి పనులతోపాటు ఐలాండ్స్ జోన్ అనుకుని ఉన్న జూపార్క్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. ఐలాండ్స్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జూ పార్క్‌ను కూడా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### అభివృద్ధి..వారసత్వం

## లక్ష్యంగా పయనం

**విపక్షాలది కుటుంబ రాజకీయం**

**వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం**

**వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం**



వారణాసి,ఏప్రిల్11: భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు.

## సన్న బియ్యం పథకం దేశానికె ఆదర్శం

**మహిళ ఆర్థిక అభివృద్ధియే ప్రభుత్వ ధ్యేయం**

**ఆధ్యాత్మిక, పర్యటక అభివృద్ధి ప్రాంతంగా శ్రీగుంజేడు ముసలమ్మ దేవాలయం**

**స్త్రీ, శిశు, గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ధనసరి అనసూయ సీతక్క**

**తొలిసమయం కొత్తగూడ ఏప్రిల్ 11**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం దేశానికె ఆదర్శం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ధనసరి అనసూయ సీతక్క అన్నారు, శుక్రవారం మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలాన్ని సందర్శించిన రాష్ట్ర పంచాయితి రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) గుంజేడు గ్రామంలోని ముసలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించి గుంజేడు గ్రామంలో రేషన్ కార్డుదారుడు సిరబోయిన క్రాంతి కుమార్, వారి కుటుంబ సభ్యులు పద్మ, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ శాఖ అధికారి విశాల్, తదితర అధికారులతో కలిసి మంత్రి సీతక్క సన్న బియ్యం భోజనం చేశారు,ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు చేదోడు, వాదోడుగా ఉంటుందని అన్నారు, ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు ఈ సన్న బియ్యం పథకం ఎంతో ఉపయోగపడుతుందని సన్న బియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తోన్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని, అభివృద్ధి సాధించాలని అన్నారు, మహిళ ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత బస్సు ప్రయాణం, 500 కె గ్యాస్ పంపిణీ పథకం, వడ్డీ లేని రుణల ద్వారా మహిళలు వివిధ నూతన వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు, ఇప్పపువ్వు ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాల ద్వారా మహిళలకు ప్రతి ఒక్కరికి ఎంతో ఆరోగ్యకరమైన పదార్థాలు తయారు చేయాలని సూచించారు, సోలార్ విద్యుత్ సరఫరా ప్లాంట్, వ్యవసాయ ఆధారిత వ్యాపారులతోపాటు వాణిజ్య వ్యాపారాలను ప్రారంభించాలన్నారు, కొత్తగూడ మండలం శ్రీ గుంజేడు ముసలమ్మ గ్రామ ఐక్య సంఘానికి 60 లక్షలు, వడ్డీ లేని రుణాలు, 25 కోట్ల బ్యాంకు లింకేజీ, గంగారం మండలానికి 15 లక్షల వడ్డీ లేని రుణాలు, పది కోట్ల బ్యాంకులు లింకేజ్ మంజూరు చేయడం జరిగిందన్నారు,శ్రీ గుంజేడు ముసలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రకటించి 50 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం కోసం ప్రతిపాదన సిద్ధం చేయాలని, చుట్టుపక్కల అడవిని పెంపొందించాలని, ప్రభుత్వం, ఆలయ అభివృద్ధి కమిటీ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు, ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అంతర్గత రోడ్ల అభివృద్ధి, త్రాగునీరు సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం, క్యూలైన్ల



నిర్మాణం, తదితర సౌకర్యాలు కల్పించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు, మహిళలకు, పౌష్టిక ఆహారం అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోషణా పక్షం, కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో వారికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు,కొత్తగూడ మండలం గాంధీనగర్ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించి సామూహిక శ్రీమంతాలు, అక్షర అభ్యాసం, అన్నప్రాసం, చేశారు, అనంతరం ములుగు నియోజకవర్గం లోని కొత్తగూడ, గంగారం మండలాలు, జిల్లా అభివృద్ధిపై సంబంధిత అధికారులు పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అన్ని విభాగాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అటవీ శాఖ అధికారి విశాల్, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, డిడబ్ల్యుఓ ధనమ్మ, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, స్థానిక తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, మండల ప్రత్యేక అధికారి వేముల సురేష్, జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.





## "ఆదివాసి అస్తిత్వ సాంస్కృతిక దీపం"

## చుంచు రామకృష్ణ (డిఇ)



"ఈ దేశ మూలవాసులైన ఆదివాసీ తెగల ప్రజలు ఒకనాటి సింధు నాగరికతకు పూర్వమే గొప్ప సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ఆదిమ బిడ్డలు. ప్రకృతి జ్ఞానం కలిగిన మేధావులు. అటువంటి పురాతన వారసత్వం, గొప్ప చరిత్ర కలిగిన ఆదివాసీలు నేడు 5 వ షెడ్యూల్ భూభాగంలోని అనేక రాష్ట్రాలలో వలస వాదుల దోపిడీకి గురవుతూ, తమ సంస్కృతికి దూరమవుతున్నారు. తమ ఆహార అలవాట్లకు విరుద్ధంగా జీవించడం వల్ల అనేక అనారోగ్యాలకు గురవుతుండటం వల్ల జనాభా తగ్గుదలతో పాటు, వారి తెగల అస్తిత్వం కూడా రోజు రోజుకి ప్రశ్నార్థకమవుతుంది"

4 లో..

# మొత్తం ఈ రాష్ట్రంలో భూముల
# “నాశనానికి బోనీ కొట్టెందే బిఆర్ఎస్”

**యూనివర్సిటీ ల భూముల పై కన్నేసిందే టిఆర్ఎస్...**
**10 సంవత్సరాలు అధికారంలో ఉండి భూముల పందేరాన్ని నడిపించింది టిఆర్ఎస్ పార్టీ..**
**ముఖ్యమంత్రి కార్యాలయాన్ని రియల్ ఎస్టేట్ సంస్థగా మర్చిందే గత పదేళ్ల పరిపాలన**
**ఎంపీ రఘునందన్ రావు**





“రాష్ట్రంలో మొట్టమొదటిగా భూముల నాశనానికి పాల్పడ్డదే గత పదే ఏళ్ల బీఆర్ఎస్ పాలన అని, అధికారంలో ఉండి భూముల పందేరాన్ని నడిపించి, ముఖ్య మంత్రి కార్యాలయాన్ని రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చిందే టిఆర్ఎస్ పరిపాలన అంటూ ఎమ్మెల్యే రఘునందన్ రావు నిప్పులు చెరిగారు. ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. 2022లో ధర్మేంద్ర ప్రాధాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి హెచ్ సి యు భూములను రక్షించాలని ఉత్తరం రాశారు అన్నారు. కాని 2023 డిసెంబర్ గద్దె దిగి పోయే వరకు బావ బహ్మర్థులు పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు అసలు తెలంగాణలో భూముల దోపిడీ గురించి మాట్లాడే హక్కు మీకు ఎక్కడ ఉన్నదని ప్రశ్నించారు”

**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ ఏప్రిల్ 11:**
సెంట్రల్ యూనివర్సిటీ భూములను రక్షించాలని, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ దగ్గరకు బీజేపీ నాయకులుగా వెళ్ళాం అని గుర్తుకు చేశారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 18 ఎకరాల భూమిని టీఎన్జీవో కాలనీకి ఇచ్చారు.

ఆనాటి రంగారెడ్డి కలెక్టర్ 2012 రాసిన ఉత్తరాన్ని బావ బహ్మర్థులు అధికారం పోయే వరకు పట్టించు కోలేదు అన్నారు. గజ్వేల్, ములుగులోని హార్టీ కల్చర్ యూనివర్సిటీ భూములను కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ భూములు అని రెవిన్యూ పహాని రికార్డు లో ఎక్కించారు అవి 1974 లోనే కేంద్రం ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ గెజిట్ భూములు అని రాసి పెట్టింది అని గుర్తు చేశారు. ఆ భూములు రెవిన్యూ రికార్డు లో కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ అని రాపించడం లో ఉన్న మతలబు భూములను అమ్ముకోవడమే కదా! అన్నారు. అధికారం లో ఉన్నప్పుడు ఒక మాట ఇంకొక మాట ఈ విధంగా ద్వంద పాటించేటోళ్ళకు ప్రతిపక్షంగా నిలబడే హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ది టిఆర్ఎస్ ది ప్రభుత్వ భూములు అమ్మడమే కదా అన్నారు. 2022 ధర్మేంద్ర ప్రధాన్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిలు 2వేల ఒక వంద 8ఏకురాలు అని రాసిన ఉత్తరాన్ని చూపించారు ఆ భూములు సెంట్రల్ యూనివర్సిటీ వే అని రాసి ఉన్నదికనుక ఆ భూములను రక్షించడానికి మేము చేసే ప్రయత్నమే నిజం, మేమెప్పుడూ విద్యార్థులు వైపే ఉన్నాయి, ఉంటామని కారాకండి గా అన్నారు ఈ ప్రెస్ మీట్ లో ఎంపీ ఈటల రాజేందర్ ఇతర బిజెపి నాయకులు ఉన్నరు

# ప్రపంచ దేశాల సుందరీమణుల వరంగల్
# పర్యటనకు ఏర్పాట్లను సిద్ధం చేయాలి

## అధికారులతో సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 11**
హనుమకొండ మే నెల 14వ హైదరాబాద్ నుండి ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు వరంగల్ పర్యటనలో భాగంగా కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, పర్యాటక, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు రాష్ట్ర పర్యాటక శాఖ సెక్రెటరీ స్మితా సబర్వాల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వివిధ దేశాలకు చెందిన సుందరిమణులు కాళోజీ కళా క్షేత్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో చేయనున్న ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కు మార్గ నిర్దేశం చేశారు. పర్యాటక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావే శాన్ని నిర్వహించి ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక నగరమైన వరంగల్ పర్యటనకు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సుందరిమణులు వస్తున్నారని,ఇది వరంగల్ నగరానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. చారిత్రక, వారసత్వ నగరమైన వరంగల్ ప్రాముఖ్యత ను తెలియజేసేందుకు వేదిక కానుందని కలెక్టర్ తెలియజేశారు. కాళోజి కళాక్షేత్రాన్ని సందర్శించనున్న వివిధ



దేశాలకు చెందిన సుందరిమణులకు తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే విధంగా మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలుకుతారని అన్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ స్థాయిలో వరంగల్ పర్యాటక, వాణిజ్య అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కాళోజీ కళాక్షేత్రం సందర్శన అనంతరం ములుగు జిల్లాలోని ప్రముఖ దేవాలయమైన రామప్పను సందర్శించి అక్కడి కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి శివాజీ, నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిపీఎం పార్టీ ఆద్వర్యం లో పూలే జయంతి

**తొలిసమయం. ఇల్లందు. ఏప్రిల్,11**
సి పీ ఎం పార్టీ మండల కమిటీ ఆద్వర్యం లో ఏలూరి భవన్ వద్ద మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ మహిళా విద్యకు, పీడిత తాడిత దీన జనోద్ధరణ కుకృషి చేసిన జ్యోతి బా పూలే తన భార్య కు విద్యా భ్యాసం చేయించే క్రమం లో ఉన్నత కులాల వారి తో అనేక అగచాట్లు పడ్డారని, ఆయన తోపాటు సావిత్రీ బాయ్ పూలే కూడా అనేక అవమానాలు భరించారని అన్నారు. స్త్రీలు ద్వితీయ శ్రేణి వారని వారికి విద్య అవసరం లేదని అనేక రకాలుగా ఆటంక పరిచినా మొక్కవోని దీక్ష తో కృషీ చేసిన ఘనుడు జ్యోతి బా పూలే అని ఆయనకు నాడే మహాత్మా అనే బిరుదు గాంధీ గారికంటే ముందే వచ్చిందని సింగరేణి కాలరీస్



ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి అధ్యక్షులు సిరాజ్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమం లో తాళ్లూరి కృష్ణ మన్యం మోహన్ రావు, సర్వన్ కుమార్ పాసి, తాళ్లూరి పద్మ, వజ్జ సురేష్,వీర భద్రం,నాగమణి,వీరయ్య,శ్రీనివాస్,సారయ్య, బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు

**తొలిసమయం. ఇల్లందు.ఏప్రిల్ 11.**
ఈరోజు అయిత ఫంక్షన్ హాల్ లో ఇల్లందు సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్స్ కు మరియు సిబ్బందికి వారి ఫ్యామిలీస్ కి కంటి పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది.ఈ కంటి పరీక్షలు మాక్స్ విజన్ ఖమ్మం వారు డాక్టర్ శరత్ గారు నరేందర్ గారు ఆధ్వర్యంలో ఈరోజు అయితా ఫంక్షన్ హాల్ లో పోలీస్ వారందరికీ కంటి పరీక్షలు 80 మందికి చేయడం జరిగింది. ఎవరికైతే కంటి సమస్యలు ఉన్నాయో వారిని గుర్తించి ,ప్రథమ చికిత్స పరీక్షలు చేయించి మేజర్ ప్రాబ్లం ఉన్న వారికి ఖమ్మం లో ఉన్న శరత్ మాక్స్ విజన్ డాక్టర్ గారి ఆధ్వర్యంలో వారికి ఆపరేషన్ చేయబడును కావున అందరూ మా పోలీస్ సిబ్బంది వినియోగించు కున్నారు ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి గారు మరియు గుండాల సిఐ గారు టేకులపల్లి సిఐ గారు సబ్ డివిజన్ ఎస్సైలు మరియు సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి
## ఝాన్సి రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**తొలి సమయం తొర్రూరు 11**
హైదరాబాద్‌లోని వారి నివాసంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ని మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ని కొడకండ్ల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, అలాగే రాయపర్తి మండలానికి చెందిన యువజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గాభివృద్ధిపై, ప్రజల మౌలిక అవసరాలపై, గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఎమ్మెల్యే కి, ఇంచార్జ్ కి తెలియజేశారు. ఎమ్మెల్యే సహానుభూతితో వారి సమస్యలు విన్నారు మరియు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు..ఇదే కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకులకు దిశానిర్దేశం చేస్తూ, పార్టీ బలోపేతానికి పటిష్టమైన సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. యువజన నాయకుల ఉత్సాహం, కార్యకర్తల నిబద్ధతను అభినందించారు. కలిసిన వారిలో కొడకండ్ల, మరియు రాయపర్తి మండలానికి సంబందించిన నాయకులు ఉన్నారు..

### ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ
## లక్ష లాదిగా తరలి వెళదాం

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**తొలి సమయం తొర్రూరు ఏప్రిల్ 11**
పెద్దవంగర మండల కేంద్రంలో ని సాయి గార్డెన్లో రజతోత్సవ సభకి జన సమీకరణ కోసం ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఈ సభను విజయవంతం మన పార్టీ బలోపేతం కోసం మనం పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు నాడు కెసిఆర్ గారి చేసిన పనులే మనకు శ్రీరామరక్ష. ఈ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది. రైతును రాజు చేసింది కెసిఆర్ అయితే ఆ రైతు వెన్నెముక విరిసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. ఒక గొప్ప విజన్ ఉన్న నాయకుడు కెసిఆర్ నాకు తెలిసి ఇద్దరే గొప్ప విజన్ ఉన్న నాయకులు నాడు ఎన్టీఆర్ గారు ప్రజల సమక్షేమం కోసం పథకాలు పెడితే వాటి కొనగింపుగా రైతులకోసం సాగునీరు కరెంట్ కోతలు లేకుండా రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు భీమా పెట్టి గొప్ప నాయకులు కెసిఆర్ పాలకుర్తి నియోజకవర్గం లో డబ్బులు మంజూరు అయ్యి ఉన్న పనులు కూడా ముందుకు సాగటం లేదు దీనిపై గ్రామాల్లో చర్చ పెట్టాలి. కెసిఆర్ ముందు చూపుతో తండాలను గ్రామపంచాయతీలు చేస్తే ఈ ప్రభుత్వం కనీసం ఆ గ్రామపంచాయతీ బిల్లులు చెల్లించడానికి కూడా ముందుకు రావడం లేదు.రైతు బంధు ఎగ్గొట్టిన ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని నీలదీయండి.ప్రజలు ఏదో ఈ మోసపూరిత హామీలకు మోసపోయి కాంగ్రెస్కు ఓటేసారని వారికి అర్థమైంది వారిని కూడా చైతన్యవంతం చేసి రైతులకు జరుగుతున్న నష్టానికి మనం అండగా నిలిచి ప్రతి ఒక్కరిని ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నుంచి రక్షించాల్సిన అవసరం మనందరికీ ఉంది. రానున్నది మన ప్రభుత్వమే కెసిఆర్ ని ముఖ్యమంత్రి చేసే దిశగా మనందరం కష్టపడాల్సిన బాధ్యత ఉంది.పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుంది.ఈ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాల్సిందిగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 11**




హనుమకొండలోని బి ఆర్ ఎస్ జిల్లా కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ స్పీకర్ మధుసూదనచారి తో పాల్గొన్న వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు శ్రీ నన్నపునేని నరేందర్.అనంతరం ఈ నేల ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల గురించి ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లు తక్కలపల్లి రవీందర్ రావు మరియు శ్రీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు మాజీ జిల్లా అధ్యక్షులు మరియు మాజీ శాసనసభ్యులు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి స్టేషన్గన్పూర్ మాజీ శాసనసభ్యులు తాటికొండ రాజయ్య హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు సతీష్ రాకేష్ రెడ్డి మరియు జిల్లా నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమసమాజ స్ఫూర్తిదాత మహాత్మా పూలే

**అణగారిన వర్గాలపై అగ్రకుల పెత్తనం నిర్మూలన కోసం మహాత్మ జ్యోతిరావు పూలే కంకణ బద్ధుడు దయ్యారు**

**రిటైర్డ్ విద్యాధికారి చీరే బిక్షపతి**

**సామాజిక అధ్యయన వేదిక వ్యవస్థాపకులు, ప్రభుత్వం ఉపాధ్యాయులు పార్నంది రామయ్య**

**తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 11:**
రిటైర్డ్ ఎంఈఓ చీరే బిక్షపతి విద్య ప్రాముఖ్యతను కుండబద్దలు కొట్టి నట్లు చెప్పారు, మాత్మ జ్యోతిరావు పూలే సమసమాజ స్ఫూర్తి స్ఫూర్తి ప్రదాత అన్నారు. గూడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతిని సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీర బిక్షపతి రిటైర్డ్ మండల విద్యాధికారి హాజరై పూలమాల పూలే విగ్రహానికి పూలమాల వేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 1827 ఏప్రిల్ 11న పూలే జన్మించాడుఅన్నారు జ్యోతిరావు పూలే నమ్మిన సిద్ధాంతం మొత్తం గా విద్యే అన్నారు. విద్య లేనిదే వికాసం లేదు. వికాసం లేనిదే పురోగతి లేదు. పురోగతి లేనిదే ఆర్థిక ప్రగతి లేదు అన్నారు. ఆర్థిక ప్రగతి లేనిదే అణగారిన వర్గాలు తరతరాలుగా పేదరికాన్ని అనుభవిస్తూ అనర్థాలతో పక్కకు నెట్టివేయ పడ్డారు అన్నారు, బడుగు బలహీన వర్గాలు బానిసలుగా ఉండడానికి కారణం అగ్రకుల దోపిడి అణచివేతను వివక్షతను అర్థం చేసుకోకపోవడం అందుకు గల కారణం చదువు లేకపోవడమే అని జ్యోతిరావు ఫులే గ్రహించాడు అని అన్నారు. సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య నివాళులు అర్పించి ఎస్సీ ఎస్టీ సంఘం డైరీ ఆవిష్కరణ చేశారు అనంతరం మాట్లాడుతూ అణగారిన వర్గాల పై ఆగ్రకుల దోపిడీ అణచివేత వివక్షలను నిర్మూలించాలని కంకణం కట్టుకొన్నారు అన్నారు అంటరాని వారికి మరియు బాలికల కొరకు పాఠశాలలను స్థాపించిన మొదటి మహనీయులు పూలే అన్నారు. అగ్రకులాల వ్యతిరేకతతో అణగారిన వర్గాలకు విద్యనందిస్తున్న క్రమంలో భయపడ్డా ఆగ్రకులస్తులు ఆయన తండ్రి



చేత కుటుంబం నుండి బహిష్కరింపజేశారు. అయినప్పటికీ పూలే బాధపడకుండా ధైర్యంతో పట్టుదలతో మరింత ముందుకు వెళ్లి తన భార్య సావిత్రిబాయి పూలే సహకారం తో ఆగ్రకుల వ్యతిరేక పోరాట పటిమను ఆమెకు నేర్పించారు. పూలే ఒక జాతి మరొక జాతిపై పెత్తనం కొనసాగిస్తున్నంత కాలం దేశం బాగుపడదని చెప్పారు.సమాజంలో కులపరమైన వివక్షను అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని ధార పోసిన మహాత్ముడు పూలే అన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న ,మండల అధ్యక్షులు చుంచ బాలయ్య, వికలాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్ర బిక్షపతి ,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సింగూడాల వీరస్వామి ,ఎలక్ట్రికల్ ఏఈ గూడూర్ గారు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిశీల విద్యార్థుల ప్రియనేత జార్జి రెడ్డి స్ఫూర్తితో సాగుదాం

**- నామాల ఆజాద్, వెంకటేష్ - పీడీయెస్యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు.**



**తొలి సమయం ఖమ్మం డెస్క్ ఏప్రిల్ 11:**
అట్టడుగు పేద వర్గాలకు,మహిళలకు,విద్య కావాలని ఆధిపత్య వర్గాలను ఎదిరించి విద్యార్థుల,మహిళల సమస్యలను పరిష్కారం కోసం పోరాడిన జార్జ్ రెడ్డి స్ఫూర్తితో నేటి విద్యార్థులు ముందుకు సాగాలని పి డి ఎస్ యు జాతీయ నాయకులు నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఖమ్మం నగరంలో పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు టి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జార్జ్ బతికుంటే తమ దౌర్జన్యాలు అవకాశవాధాలు సాగవని మనువాదులు పన్నాగం పన్ని కత్తులతో దాడి చేసి హతమార్చిన నాటి నుండి నేటి వరకు ప్రగతిశీల గొంతులు జార్జి ఆశయాన్ని నినదిస్తూనే ఉన్నాయని వారు తెలిపారు. ఏ ఉన్మాద శక్తులైతే జార్జ్ ని దాడి చేసి చంపారో ఆ భావాజాలమే అధికార పగ్గాలను పట్టుకొని హింసాయుత పరిపాలన కొనసాగిస్తుంది. నేడు దేశంలో మోడీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద, మనువాద రాజ్య స్థాపన కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదన్నారు. మోడీ విధానాలు దేశ లౌకిక వ్యవస్థకు, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తికి పెను ప్రమాదకరంగా మార్చుతూ విద్యా సంస్థలను మత ప్రయోగశాలలుగా మార్చేందుకు, నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి, విద్యారంగాన్ని పూర్తిగా కాషాయకరించే కుట్రపూరిత చర్యలకు ఒడిగట్టిందని వారు విమర్శించారు. స్కిల్ ఇండియా పేరుతో విద్యార్థులను మోసం చేసేందుకు విద్యారంగాన్ని ప్రైవేటు కంపెనీలకు తాకట్టు పెడుతున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కొల్లగొట్టేందుకు పార్లమెట్ ను సైతం దిక్కరించి యూనివర్సిటీల నూతన ముసాయిదాను ఆమోదించే ప్రక్రియను కొనసాగిస్తున్న తరుణంలో జార్జ్ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.పి డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీలో భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన భావ ప్రకటన, స్వేచ్ఛ హక్కులను హరిస్తూ, ధర్నాలు, నినాదాలు, నిరసన ప్రదర్శనలు, చేయరాదని అప్రజాస్వామిక సర్క్యులర్ తీసుకువచ్చిందన్నారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ గద్దలకు అప్పగించే దుర్మార్గపూరిత చర్యలు చేపడుతున్నదని వారి దుయబట్టారు. ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను వ్యతిరేకిస్తూ, ప్రశ్నిస్తూ ఉద్యమిస్తున్న విద్యార్థుల గొంతు నొక్కి అక్రమ అరెస్టులకు పాల్పడుతూ, తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. పాలకుల విధానాలను విద్యార్థి ,యువత, ప్రగతిశీల శక్తులంతా ఐక్యమై సంఘటితంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంలో విద్యార్థి ఉద్యమ కర్తవ్యాలను జార్జిరెడ్డి స్ఫూర్తితో ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా నాయకులు సందీప్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజం కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే

**199వ పూలే జయంతిలో రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 11**
ములుగు రోడ్డు లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్లు డాక్టర్ సత్య శారద ప్రావీణ్య సమాజంలో అన్ని వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయులలో మహాత్మా జ్యోతిబా పూలే ఒకరని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు జంక్షన్ లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ,వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి కే ఆర్ నాగరాజు,కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే,అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి ఉద్యమిస్తూ భవిష్యత్ తరాలకు మార్గం చూపిన మహనీయుల్లో జ్యోతిబాపూలే ఒకరని పేర్కొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు, విద్యా విషయంలో పూలే దంపతులు చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. సమానత్వం కోసం వారు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని చెప్పిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. జ్యోతిబాపూలే సతీమణి అయిన సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలను అందించారని, పూలే దంపతులు ఆనాడే బాలికల కోసం విద్యాలయాన్ని స్థాపించి బాలికలు చదువుకోవాలని అవగాహన కల్పించారని గుర్తు చేశారు. సమాజానికి జ్యోతిబాపూలే అందించిన సేవలను ఆదర్శంగా తీసుకొని అంబేద్కర్ లాంటి వారు ముందుకు సాగారని అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేశారని, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. సమాజంలో అభివృద్ధి అనేక సంస్కరణలు తీసుకువచ్చి చరిత్రలో పూలే దంపతులు నిలిచారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను చేసిన మహనీయుల కృషి ఫలితంగానే మనం ఆ ఫలాలను పొందుతున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు హక్కులు కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి అమలు చేస్తున్నామని అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తల్లి దండ్రులకు బడి పిల్లల ఉత్తరాలు..

**- మా బడిలో పైసా ఖర్చు లేదు అన్ని సౌకర్యాలు ఉన్నాయి**

**వచ్చే సంవత్సరం మా బడిలో మీ పిల్లలను చేర్పించాలంటూ.. తల్లి దండ్రులకు పిల్లలు ఉత్తరాల ద్వారా వినూతన పద్ధతిలో తెలియ జేశారు..**



**తొలి సమయం, మహబూబాబాద్ ఏప్రిల్ 11:**
బలపాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు... వచ్చే విద్యా సంవత్సరం కోసం నూతన విద్యార్థుల నమోదుకై తమ తల్లిదండ్రులకు ... మా ప్రభుత్వ బడి అన్ని సౌకర్యాలతో , ప్రైవేటు పాఠశాలకు దీటుగా, మేము చదువుతోపాటు ఆటలు, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ , సాంస్కృతిక కార్యక్రమాలలో మేము ముందుంటున్నాం. కాబట్టి మీరు మా పాఠశాల గురించి మన ఇరుగుపొరుగు వారికి తెలియజేసి వారి పిల్లల్ని కూడా మా పాఠశాలలో చేర్పించమని ప్రోత్సహించండి. ఇక్కడ పైసా ఖర్చు లేదు.విద్యతో పాటు అన్ని సౌకర్యాలు ఉచితంగా పొందవచ్చని తెలియజేయండి. మా ప్రభుత్వ బడికి సహకరించండి.అంటూాలి... వినూత్న రీతిలో ఉత్తరాల ద్వారా తెలియజేస్తూ పోస్ట్ బాక్స్ లో ఉత్తరాలను వేసి ఒక నూతన వరవడికి శ్రీకారం చుట్టారు.పాఠ్యాంశానికి అనుగుణంగా, కనుమరుగైన ఉత్తరాలు, వాటిని రాసే విధానాన్నీ మరియు పోస్ట్ ఆఫీస్ యొక్క విధులు, వాటి వినియోగం గురించి తెలియజేస్తూ..మా ప్రాథమిక పాఠశాల 4,5 తరగతుల విద్యార్థులచే పిల్లల నమోదుకై తల్లిదండ్రులకు ఉత్తరాలచే ప్రచారం చేయించామని ప్రధానోపాధ్యా యురాలు తేలుకుంట్ల సునీత తెలియజేశారు. ఈ ప్రయత్నంలో మా పాఠశాల ఉపాధ్యాయులు టి.మమత, వి.జ్యోతి, టి. రామారావు పాల్గొన్నారు.

## పిఆర్టియుటీఎస్ ఎన్నికల క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా సంకా బద్రినారాయణ నియామకం

**తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 11:**



పి ఆర్ టి యు టి ఎస్ ఎన్నికల క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా పి ఆర్ టి జిల్లా అధ్యక్షులు సంక బద్రీనారాయణను నియమించినట్లుఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాన్ని సమర్థిస్తూ హర్షం వ్యక్తం చేసిన మండల శాఖ అధ్యక్షులు భూక్యా రామోజీ నాయక్ మరియు మండల ప్రధాన కార్యదర్శి కాపర బోయిన సుజాత మరియు జిల్లా రాష్ట్ర బాధ్యులకు సంక భద్రి నారాయణ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు

# మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి




**తొలి సమయం వరంగల్ ఏప్రిల్ 11**
నేడు సౌత్ సెంట్రల్ రైల్వే కాజీపేట రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్ ఆవరణలో సంఘ సంస్కరణ కర్త, ప్రముఖ సామాజికవేత్త %వాషె, క్, వాదీజ% ల అభివృద్ధి కోసం విద్య ఉంటేనే జ్ఞానులవుతారని ఈ సామాజిక వర్గాల కోసం అనునిత్యం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి 62వ, డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా ప్రత్యేక అతిథిగా తెలంగాణ రైల్వే %జీూజ% చైర్మన్ కోంద్ర నర్సింగరావు విచ్చేసి జ్యోతిరావు పూలే గారి విగ్రహానికి పూలమాలలు వేసి వక్తలు ప్రసంగిస్తూ ఆత్మ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాలకు విద్య అందిస్తేనే పురోగతి సాధిస్తారని అందరి విద్య కోసం పాఠశాలలు నెలకొల్పారని ఆయనకు 12 ఏళ్లు 9 సంవత్సరాల సావిత్రిబాయి పూలే తో వివాహం జరిగిందని వారి భార్య కూడా విద్యను నేర్పించి ఆమె ద్వారా కూడా అందరికీ విద్య అందేలా పాఠశాలలు నెలకొల్పారని నిస్వార్థ సేవకులని కొనియాడారు. వారి స్ఫూర్తితో అంబేద్కర్, రాజారామ్ మోహన్ రాయి వారి తదనంతరం జ్యోతిరావు పూలే కూడా ఎన్నో సంస్కరణలు చేశారని ఆ మహానుభావుల స్ఫూర్తితో ఎస్సీ ఎస్టీ బీసీలు కూడా రాజ్యాధికారాన్ని సాధించాలని వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమం తెలంగాణ రైల్వే %జీూజ% కన్వీనర్ మరియు రైల్వే ఇనిస్ట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేంద్ర అధ్యక్షతన కొనసాగగా ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు ధారావత్ రఘు, సభ్యులు %వా%.లక్ష్మినారాయణ, ఎల్లయ్య, ఉప్పుల బాబు, నల్లెల సోమేశ్వర్ రావు, కొయ్యడ శ్రీకాంత్, అమర్నాథ్, అనిల్, యాకయ్య, మరియు రైల్వే కారిక సోదరులు పాల్గొన్నారు.

# భారత్,చైనా సుంకాల గొడవ

**న్యూఢిల్లీ,ఏప్రిల్11:**
అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది. దీంతో ప్రపంచం తీవ్ర గందరగోళానికి గురైతుంది. ఇక, ఈ వివాదంపై న్యూఢిల్లీలో జరిగిన కార్నెగీ ఇండియా గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారతదేశం తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు.

# "ఆదివాసి అస్తిత్వ సాంస్కృతిక దీపం"

# చుంచు రామకృష్ణ (డిఇ )

చిరుమళ్ళ ను ఆదివాసీ ఆధ్యాత్మిక కేంద్రంగా సమ్మక్క, సారలమ్మ జాతర, 21 రోజుల దీక్షలు ఆదివాసీ కోయతుర్ సమ్మేళన నిర్వహణ,

ఐదవ షెడ్యూల్ భూభాగం లోని అనేక రాష్ట్రాలలో వలస వాదుల దోపిడీకి గురవుతూ, సంస్కృతికి దూరమవుతున్న, అంతరించిపోతున్న నల్లమల చెంచులు పాపికొండల కొండ రెడ్లు ఆదిలాబాద్ తోటి కోలాంలు పౌష్టి కాహార లోపం నుండి కాపాడడానికి ప్రణాళిక బద్ధమైన అడుగులు

ఆదివాసి మహిళా శక్తి, రిటైర్డ్ ఉన్నత ఉద్యోగులు ఇంజనీర్స్,డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, తన తోటి ఉద్యోగుల సహాయం సమన్వయాలతో అడవుల్లో ఆదివాసీలకు చిరుధాన్యాలతో కూడిన పౌష్టిక ఆహారం అందించే ప్రయత్నంతో ఆదివాసీల ఆరోగ్యం,జాతి పరిరక్షనకు అడుగులు వేస్తున్న కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ అభినందనీయులు

"ఈ దేశ మూలవాసులైన ఆదివాసీ తెగల ప్రజలు ఒకనాటి సింధు నాగరికతకు పూర్వమే గొప్ప సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ఆదిమ బిడ్డలు. ప్రకృతి జ్ఞానం కలిగిన మేధావులు. అటువంటి పురాతన వారసత్వం, గొప్ప చరిత్ర కలిగిన ఆదివాసీలు నేడు 5 వ షెడ్యూల్ భూభాగంలోని అనేక రాష్ట్రాలలో వలస వాదుల దోపిడీకి గురవుతూ, తమ సంస్కృతికి దూరమవుతున్నారు. తమ ఆహార అలవాట్లకు విరుద్ధంగా జీవించడం వల్ల అనేక అనారోగ్యాలకు గురవుతుండటం వల్ల జనాభా తగ్గుదలతో పాటు, వారి తెగల అస్తిత్వం కూడా రోజు రోజుకి ప్రశ్నార్థకమవుతుంది"

ఇప్పటికే నల్లమల చెంచులు, పాపికొండల కొండరెడ్లు, ఆదిలాబాద్ తోటి, కోలాంలు వేల సంఖ్యకు పరిమితమవుతున్నాయి. దీనికి తోడు ఓటు బ్యాంక్ రాజకీయాల వల్ల ఉత్తరాది రాష్ట్రాల నుండి లక్షలాదిగా వస్తున్న వారు అక్రమంగా ఎస్టీ రిజర్వేషన్ పొందుతున్నారు. వారి జీవనాధారమైన అడవులను సైతం నిర్ధాక్షిణ్యంగా నరికి వేయడం, ప్రాజెక్టులకు వాడటం వల్ల ఆహార సేకరణ సైతం కష్టమవుతుంది.

మరో పక్క పోడు వ్యవసాయం చేసుకునే ఆదివాసీ తెగల ప్రజలను అటవీ అధికారులు నిరంతరం వేధిస్తూ, అక్రమ కేసులు పెట్టడం వల్ల వీరి జీవితం అగమ్యగోచరం అవుతూ చెట్టుకు ఒకరు పుట్టకు ఒకరు అన్నట్లు ఛత్తీస్గఢ్ నుండి తెలంగాణ, ఆంధ్రా,ఒడిషా రాష్ట్రాల్లోని అడవుల్లో నివాసముండే వీరికి మౌలిక సదుపాయాలు లేక, పుట్టిన బిడ్డలకు పౌష్టిక ఆహారం, ప్రాథమిక విద్య, వైద్యం లభించకపోవడంతో గత మూడు దశబ్ధాలుగా ఆదివాసీ తెగలు తమ హక్కుల కోసం, రాజ్యాంగ చట్టాల అమలు కోసం నిరంతరం ఏదో ఒక రూపంలో పోరాడుతున్నారు

వీరి సమస్యకు పరిష్కారం పాలకులు, అధికారులు, మేధావులు చూపెట్టకపోగా, మరోపక్క మావోయిస్టు ముద్రతో వీరి ప్రజాస్వామిక హక్కులను అణచివేయడం దారుణం. ఇటువంటి పరిస్థితుల నేపధ్యంలో ఆదివాసీ తెగలకు చెందిన రిటైర్డ్ ఉన్నత ఉద్యోగులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లను, డాక్టర్లను, ప్రభుత్వ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ, తను పుట్టిన జాతి ప్రజల కోసం సంస్కృతి చేయాలనే తలంపుతో , 9 డిసెంబర్ 2017 సరూర్ నగర్ బహిరంగ సభ ద్వారా స్ఫూర్తి పొంది, గత 8 ఏళ్లుగా నిరంతరం సంస్కృతి రక్షణ కోసం శ్రమిస్తున్నారు చుంచు రామకృష్ణ(డి.ఈ). ఒక పక్క వృత్తి భాధ్యతలు, మరో పక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే, సెలవు దినాలు, ప్రత్యేక సెలవులు పెట్టుకుంటూ జాతి ప్రయోజనాల కోసం జరుగుతున్న ప్రజా పోరాటం, న్యాయపోరాటం , రాజకీయ పోరాట కార్యక్రమాల్లో... నేను సైతం నా జాతి కోసం.. అంటూ అందరిని సమన్వయం చేసుకుంటూ వెళుతున్నారు ఆదివాసి 9 తెగల సమన్వయకర్త మరియు కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ. చివరి అస్త్రంగా , ఆదివాసీల సంస్కృతి పరిరక్షణ కోసం సాంస్కృతిక ఉద్యమానికి పునాది వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చిరుమల్ల కేంద్రంగా సమ్మక్క – సారలమ్మ జాతర, 21 రోజుల దీక్షలు, ఆదివాసీ కోయతుర్ వేల్పుల సమ్మేళనం నిర్వహిస్తూ జాతిని ఏకం చేయడం చేస్తున్నారు. అదేవిధంగా నేడు ప్రతి ఒక్కరి నోటా ఆరోగ్యం కోసం వినిపిస్తున్న చిరు ధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలు ఆదివాసీ పెద్దల ద్వారా తెలుసుకుని, గతంలో 3 దశాబ్దాలకు పూర్వం ఆదివాసీ తెగల ప్రజలు ఉపయోగించే కొర్రలు, సామలు, జొన్నలు, రాగులు, అవిసెలు వంటి వాటితో జావ, గడకలు స్వీకరించడం ద్వారా డయాబెటిస్, గుండెనొప్పులు, కాళ్ల నొప్పులు, కంటి చూపు సమస్యలతో పాటు అనేక ఇతర రోగాలకు దూరంగా జీవించేవారని గుర్తుచేసుకుని, అటువంటి సేంద్రియ ఆహార చిరు ధాన్యాలతో ఇప్ప,రాగి, అవిసె, జొన్న, నువ్వు లడ్డూలను భద్రాచలం కేంద్రంగా పనిచేస్తున్న ఆదివాసీ మహిళా శక్తి బృంద సభ్యురాల్ల తోడ్పాటుతో తక్కువ ధరతో, ఎక్కువ నాణ్యతతో తయారు చేపిస్తూ ఆదివాసీ పిల్లలకు, బాలింతలకు, వృద్ధులకు అందించే కార్యక్రమానికి చుంచు రామకృష్ణ శ్రీకారం చుట్టడం జరిగింది. గతంలో కూడా కరోనా సందర్భంలో, గోదారి వరదలు వచ్చినప్పుడు కూడా దాతల సహకారంతో అనేక వందల మంది ఆదివాసీలకు రాగి, జొన్న పిండితో పాటు, పల్లీ, నువ్వుల ఉండలు ఇతర నిత్యవసర కిరాణా సామగ్రిని అందచేయడం తెలిసిందే. రోజు రోజుకు ఇటువంటి సేవా కార్యక్రమాలతో తలమునకలవడంతో, తను పనిచేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల సహకారం అందిస్తున్నారు. ఇప్పుడున్న కల్తీ ఆహార పదార్థాల వల్ల ఆరోగ్యాలు దెబ్బతిని లక్షల రూపాయలు వైద్యానికి అవుతున్నాయని, దీనికంటే నివారణే ముఖ్యమైనదని భావించి చిరు ధాన్యాల వాడకం వల్ల అందరి ఆరోగ్యం బాగుంటుందని ఉద్యోగ మిత్రులు ఆలోచించి ఆదివాసీ బిడ్డల ఆరోగ్యం కోసం, మా కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. చిరు ధాన్యాలను ఆదివాసీ గూడెల్లో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న ఆదివాసీ తెగల సమన్వయకర్త మరియు కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ అభినందనీయులు.



**గుమ్మడి లక్ష్మీనారాయణ**
ఆదివాసీ రచయితల వేదిక

# రామరాజ్యం కోసం కృషి చేస్తున్నా

**టెంపుల్ టూరిజం కోసం ప్రత్యేక దృష్టి**

**ఒంటిమిట్టలో స్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పణ**

**శ్రీరాముడి సాక్షిగా ప్రతి పేదకు న్యాయం జరగాలన్నదే ఆకాంక్ష**

**సిఎం చంద్రబాబు వెల్లడి**



**కడప,ఏప్రిల్11:** ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం కన్నులు పండుగ జరిగిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేదికపై నుంచి సీతారాముల కల్యాణం తిలకించారు. అనంతరం వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. పరిపాలన అంటే రామ పాలన జరగాలని అందరూ కోరుకుంటారన్నారు. తండ్రి మాటకు కట్టుబడి వనవాసం వెళ్లారు.. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఒంటిమిట్ట లో జరుపుకుంటున్నాము. వెంకటేశ్వర స్వామి కనుసన్నల్లోనే జరగాలని కోరుకున్నాం.. ఒకే శిలపై సీతారాముల తో పాటు లక్ష్మణ విగ్రహాలు ఉన్నాయి. తిరుపతి నుంచి ఒంటిమిట్ట వచ్చే సర్క్యూట్ ను అభివృద్ధి చేయాలి. కొండలపై ఆయుర్వేద మొక్కలు నాటాలి. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం. టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తాం. దేవాలయాలు లేకుంటే కుటుంబ వ్యవస్థ ఉండేది కాదు. ప్రపంచంలో ఇటువంటి వ్యవస్థ లేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామరాజ్యం తేవడమే నా ఆకాంక్ష అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీరాముని సాక్షిగా రాష్ట్రం ప్రతిఒక్కరికి న్యాయం చేస్తానని.. భారత దేశం ప్రధాని నాయకత్వంలో రామరాజ్యం గా అభివృద్ధి చెందుతుందన్నారు. రామరాజ్యం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీరాముని స్ఫూర్తి గా తీసుకుని ప్రతిఒక్కరు పేదలకు అండగా నిలవాలని.. సాటి మానవుడు కూడా బాగుండాలని అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.. రాత్రికి ఒంటిమిట్ట లోని టీటీడీ గెస్ట్ హౌస్ లో సీఎం బస చేయనున్నారు. ఇదిలావుంటే వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీకోదండరామస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఒంటిమిట్టకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు-వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. కల్యాణోత్సవం నిర్వహణకు తితిదే, జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. 52 ఎకరాల విస్తీర్ణంలో కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికకు ఎదురుగా రెండు వైపులా భక్తులు కూర్చోవడానికి 147 గ్యాలరీలు సిద్ధం చేశారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించేందుకు 13 భారీ ఎల్ఈడీ తెరలు అమర్చారు. విజయవాడ నుంచి నేరుగా కడప ఎయిర్ పోర్ట్కు చేరుకున్న సీఎం చంద్రబాబు దంపతులు రోడ్డు మార్గంలో ఒంటిమిట్ట చేరుకున్నారు. అనంతరం స్వామి వారికి పట్టు- వస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత స్వామి వారి ప్రసాదాన్ని సీఎం చంద్రబాబు దంపతులకు అందజేశారు.

## గోశాల గోవుల మృతి ఆరోపణలు సత్యదూరం

**అత్య ప్రచారాలుగా కొట్టి పారేసిన టిటిడి**

**తిరుమల,ఏప్రిల్11:** గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొద్దిమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని టిటిడి ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మృతి చెందిన గోవుల ఫొటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఫొటోలు అసలు గోశాలకు సంబంధించినవి కావు, దురుద్దేశంతో కొద్ది మంది మృతి చెందిన గోవుల ఫొటోలను టిటిడి గోశాలలో మృతి చెందినవిగా చూపించి.. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్న ప్రచారం అని కొట్టిపారేసింది.. గోవుల చనిపోయా యంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించిన టిటిడి, ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.. టిటిడి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే ఈ ప్రకటన విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం నకు చెందిన గోశాలలో గోవులు మృతిచెందాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఇక, ఈ వ్యవహారంపై టిటిడి మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి.. ఆరోపణలు గుప్పించారు.. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయం అంటున్న ఎన్డీఏ ప్రభుత్వంలో వందకు పైగా గోవులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. స్వీ గోశాలలో గత మూడు నెలలుగా వందకుపైగా ఆవులు చనిపోతున్నా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.. అయితే, ఎస్వీ గోశాలలో గోవులు మృతిచెందాయంటూ జరుగుతోన్న ప్రచారంపై స్పందించిన టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయంటూ వస్తున్న వార్తలు అవాస్తవం అని కొట్టిపారేసింది..

## భగ్గుమన్న బంగారం ధరలు

**మేలిమి బంగారం రూ.96,450కు చేరిక**

**న్యూఢిల్లీ,ఏప్రిల్11:** బంగారం ధర మళ్లీ భగ్గుమంది. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలతో పసిడి ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోరు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో పసిడికి పెట్టుబడులు మళ్లుతున్నాయి. దీంతో దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6250 పెరిగి శుక్రవారం రూ.96,450కు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.96,430 స్థాయి వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాము) బంగారం ధర 3,223 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇంట్రాడేలో 3,237 డాలర్లకు చేరుకుంది. దీన్ని అనుసరించి దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు ) బంగారం ధర రూ.96 వేల మార్కు దాటింది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.96 వేలు పలుకుతోంది. వెండి కిలో రూ.95,500 పలుకుతోంది. వాణిజ్య యుద్ధ భయాలతో ఏప్రిల్ 2న బంగారం ఔన్సు అంతర్జాతీయంగా 3200 డాలర్లను తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే, ఇతర దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేసిన ట్రంప్.. చైనాపై మాత్రం కొనసాగించారు. ఈ పరిణామాలు వాణిజ్య, ఆర్థిక అనిశ్చితులకు కారణమయ్యాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. డాలర్ ఇండెక్స్ నూరు డాలర్లకు దిగువకు చేరడం పసిడికి మరింత డిమాండ్ పెంచింది. సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలను పెంచుకుంటుండడంతో పుత్తడి ధరకు రెక్కలు రావడానికి కారణమని విశ్లేషిస్తున్నారు.

## టెట్ షెడ్యూల్ విడుదల

**జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు**

**హైదరాబాద్,ఏప్రిల్11:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## చేబ్రోల్ కిరణ్కు 14 రోజుల రిమాండ్

**గుంటూరు,ఏప్రిల్11:** మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెదేపా కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కు మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. శుక్రవారం మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అతడికి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య కోర్టుకి తరలించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. నిందితుడు కిరణ్‌కు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా మంగళగిరి గ్రామీణ సీఐపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. చేబ్రోలు కిరణ్‌పై 111 సెక్షన్ పెట్టడంపై జడ్జి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇష్టానుసారం సెక్షన్లు పెట్టి చట్టాన్ని అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వై.ఎస్.భారతిని ఉద్దేశించి కిరణ్ చేసిన అసభ్య వ్యాఖ్యలను తెదేపా అధిష్ఠానం తీవ్రంగా పరిగణించిన విషయం తెలిసిందే. అతడిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

## దేవుళ్లను కించపర్చేలా రవి, సుధీర్‌ల స్కిట్

**హిందూ సంఘాల హెచ్చరికలు**

**హైదరాబాద్,ఏప్రిల్11:** బుల్లితెర నటులు యాంకర్ రవి, సుడిగాలి సుధీర్ చేసిన స్కిట్ ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఓ టీవీ షో సందర్భంగా వారు చేసిన స్కిట్‌పై హిందూ సంఘాల ప్రతినిధులు భగ్గుమన్నారు. హిందూ దేవుళ్లను అపహాస్యం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. హిందువుల మనోభావాలను రవి, సుధీర్ దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూ సంఘం నేత కేవశరెడ్డి.. యాంకర్ రవికి ఫోన్ చేసిన మాట్లాడిన ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. దేవుడి పేరితో డ్రామాలు చేయడం తగదంటూ రవిని ఆయన హెచ్చరించారు. దేవుళ్లను కించపరుస్తూ స్కిట్‌లు చేయడం ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందంటూ మండిపడ్డారు. అయితే హిందూ దేవుళ్లను తామెక్కడా కించపరచలేదని యాంకర్ రవి తెలిపారు.

